28 నుంచి బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయదుర్గం: గోపన్‌పల్లితండాలో ఈదమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభం, బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఆలయంలో ఉదయం గోపూజ, అఖండ దీపారాధన, గణపతిపూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, సాయంత్రం యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠాపన, వాస్తు పూజ, అంకురార్పణ శాంతి హోమాలు నిర్వహిస్తారు. శనివారం ఉదయం 7 గంటలకు సర్వదేవతా మండప ఆరాధన, కలశ ఆరాధన, పంచగవ్యాదివాసం, క్షీరాదివాసం, జలాదివాసం, ప్రధాన హోమాలు, సాయంత్రం 4 గంటలకు అమ్మవారికి ఊరేగింపు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఆదివారం సర్వదేవతా మండప ఆరాధన, మహాపూర్ణాహుతి, బోనాల సమర్పణ, ఒడిబియ్యం, అన్నదానం, సాయంత్రం 6 గంటలకు సామూహిక కుంకుమార్చన, రాత్రి 7.30 గంటలకు పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

కుట్టు మిషన్ల పంపిణీ



రాయదుర్గం: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద నిర్మాణ్ సంస్థ ఆధ్వర్యంలో 20 మంది మహిళలకు సోమవారం పెగా సిస్టమ్స్ సాఫ్ట్‌వేర్ కంపెనీ కుట్టుమిషన్లను పంపిణీ చేసింది. గచ్చిబౌలిలోని సిద్ధిఖ్‌నగర్‌లో నిర్మాణ్ ఆర్గనైజేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పెగా సిస్టమ్స్ లీడ్ కౌన్సిల్ ఇంటర్నేషనల్ లా, సీఎస్ఆర్ లీడ్ డాక్టర్ ధరణికోట సుయోధన్, అప్లికేషన్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ గౌతమ్ పర్వా, నిర్మాణ్ ఆర్గనైజేషన్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అనురాధ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాల మహిళలకు సాధికారత కల్పించేందుకు ఈ కుట్టుమిషన్లను పంపిణీ చేసినట్లు వివరించారు.

సన్మానం



చందానగర్: జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గం ఇంచార్జి వి.జగదీశ్వర్ గౌడ్‌ను సోమవారం సన్మానించారు. నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో ఆయనను నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శాలువాతో సన్మానించారు.

గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు రావాలి

రాయదుర్గం: గ్రామీణ ప్రాంతాల నుంచి నూతన ఆవిష్కరణలు రావాల్సిన అవసరం ఉందని కలామ్ స్ఫూర్తి యాత్ర నిర్వాహకులు పేర్కొన్నారు. రాష్ట్రంలో కలామ్ స్ఫూర్తి యాత్రను ముగించుకొని సోమవారం టీ వర్క్స్‌కు చేరుకున్న వారిని ఘనంగా సత్కరించారు. టీ వర్క్స్ ప్రాంగణంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఇంటీరియమ్ సీఈఓ మెరాజ్ ఫహీమ్ పూలమాలలతో సత్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో పర్యటించి 17,151 మంది విద్యార్థులను కలిశారు. ఐఓటీ, రోబోటిక్స్, త్రీడీ ప్రింటింగ్, ఏఐ, ఎంఎల్ వంటి అంశాలను వారికి వివరించారు.

పాఠశాల వార్షికోత్సవం



మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పకళావేదికలో సోమవారం శేరిలింగంపల్లి శ్రీవిద్య అభ్యాసన స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సినీనటుడు ప్రదీప్, శ్రీవిద్య సంస్థల వ్యవస్థాపకుడు లయన్ ఎం.వి చౌదరి, ఎస్పీ ఇంటలిజెన్స్ తెలంగాణ ధూళిపాళ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్.. 12 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.... ఆదివారం నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 12 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రూ. వెయ్యి చొప్పున జరిమానా, ఐదుగురికి రూ.1500 , మరో వ్యక్తికి రూ.2 వేల జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

శివరాత్రికి ముస్తాబైన మల్లన్నగుట్ట

రెండురోజుల పాటు ఉత్సవాల నిర్వహణ

- 26వ తేదీ రాత్రి ఒగ్గుకథ, తెల్లవారుజామున అగ్నిగుండం
- 27న మల్లికార్జునస్వామి కల్యాణం



మల్లికార్జునస్వామి


రాయదుర్గం: మహా శివరాత్రి వేడుకలకు రాయదుర్గంలోని మల్లన్న గుట్ట ముస్తాబైంది. శతాబ్దాల చరిత్ర కలిగిన మల్లికార్జునస్వామికి ప్రతిఏటా మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. రెండు రోజులపాటు ఈ ఉత్సవాలను నిర్వహిస్తారు. రాయదుర్గంకు చెందిన రాజిరెడ్డి ఈ ఉత్సవాలను నిర్వహించేవారు. ప్రస్తుతం ఆయన కుమారులు మల్లేష్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, సందీప్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్నారు.

అభిషేకాలు.. అన్నదానం


మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని రెండురోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తారు. 26న ఆలయంలో మల్లికార్జున స్వామికి అభిషేకాలు జరుగుతాయి. రాత్రి 8 గంటల నుంచి 27వ తేదీ తెల్లవారుజాము వరకు మల్లికార్జునస్వామిపై ఒగ్గు కథ చెబుతారు. తర్వాత అగ్నిగుండం ఏర్పాటు చేస్తారు. ఆ తర్వాత తెల్లవారుజామున 5 గంటలకు మల్లికార్జునస్వామి భ్రమరాంబదేవి కల్యాణం నిర్వహిస్తారు. అనంతరం ఒడి బియ్యం నింపడం, భక్తులకు దర్శనం కల్పిస్తారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

పటాన్‌చెరు రామలింగేశ్వర దేవస్థానంలో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు టోల్‌గేట్ సమీపంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో నేటి నుండి మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని ఆలయ అర్చకులు మహేష్, గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, నీటి వసతి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఉత్సవాల నేపథ్యంలో మంగళవారం ఉదయం అభిషేకం, కుంకుమార్చన, ధ్వజారోహణం, శివ స్వాముల ఇరుముడులు, శిఖర పూజ, అన్న ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. మహాశివరాత్రి రోజు ఉదయం 3 గంటల నుండి తొలి పూజ, రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన ఉదయం 6 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు సామూహిక అభిషేకాలు... సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక అలంకరణ, నక్షత్ర హారతి, లింగోద్భవ కాలంలో స్వామి వారికి అభిషేకం ఉంటుందన్నారు. చివరి రోజు గురువారం ఉదయం 8 గంటలకు స్వామి వారి కల్యాణం, సాయంత్రం పల్లకీసేవ నిర్వహించనున్నట్టు తెలిపారు.



రాయదుర్గంలో గుట్టపై ఉన్న మల్లికార్జున స్వామి ఆలయం



విద్యుత్ కాంతుల్లో రామలింగేశ్వర ఆలయం

ప్రజావాణి.. 4 ఫిర్యాదులు

చందానగర్ : చందానగర్ సర్కిల్ –21 కార్యాలయంలో సోమవారం ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 4 వినతిపత్రాలు అందగా టౌన్‌ప్లానింగ్ 4, ఒకటి రెవెన్యూ విభాగానికి సంబంధించిన కాగా వెంటనే సంబందిత అధికారులకు సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి ఆదేశించారు. ప్రజలు తమ సమస్యలను ప్రజావాణిలో వినిపించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి సర్కిల్‌లో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపకమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 6 ఫిర్యాదులు అందజేశారు. ఇంజనీరింగ్ 1, టౌన్‌ప్లానింగ్ 2, రెవెన్యూ 1, ఇంజనీరింగ్ 1, డీపీఓ 1 చొప్పున దరఖాస్తులు వచ్చాయని అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీలు, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్, ప్రాజెక్టు ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో ఫిర్యాదు తీసుకుంటున్న డీసీ మోహన్‌రెడ్డి

శాంతిసరోవర్‌లో శివరాత్రి వేడుకలు ప్రారంభం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో శివరాత్రి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు భక్తులకు అవకాశం కల్పించారు. శాంతిసరోవర్‌లో ప్రత్యేకంగా 16 ఫీట్ల రుద్రాక్షల శివలింగం ఏర్పాటు చేశారు. ఆధ్యాత్మిక ప్రదర్శనలు, అభ్యాస ఆటలు, ఆడియో విజువల్స్ ప్రదర్శన, మెడిటేషన్, రాజయోగ కోర్సుల నిర్వహణ, చర్చా కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శివరాత్రి రోజు జాగరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రోజూ పెద్ద సంఖ్యలో భక్తులు ఉత్సవాలలో పాల్గొంటున్నారు.





మార్చి 2న ఎల్లో రిబ్బన్ రన్

పంజగుట్ట: ఎండోమెట్రియాసిస్ (గర్భాశయం వెలుపల పొర ఏర్పడడం) సమస్య ప్రస్తుతం మహిళల్లో విపరీతంగా పెరుగుతుందని దీనిపై అవగాహన ఎంతో అవసరమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్, ఐఏఎస్ అధికారి ఆర్.వి.కర్ణన్ అన్నారు. ఎండోమెట్రియాసిస్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మార్చి 2న నెక్లెస్ రోడ్డులోని జలవిహార్‌లో 10కె, 5కె, 3కె ఎల్లో రిబ్బన్ రన్‌లు నిర్వహిస్తున్న నేపథ్యంలో రన్ పోస్టర్, టీ షర్ట్‌ను సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ విమీ బింద్రా, సినీనటి డాక్టర్ సాయి కామాక్షి, వివేక్ గోయల్, డాక్టర్ అర్చనా రెడ్డి, డాక్టర్ శ్వేతా రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఈ వ్యాధితో ప్రస్తుతం సగటున 10 మంది మహిళల్లో నలుగురు బాధపడుతున్నారని, ఈ వ్యాధి వస్తే గర్భధారణ కష్టమవుతుందన్నారు. ఇది రెండవ ఎడిషన్ రన్ అని, ఈ రన్‌లో సుమారు 1500 మంది పాల్గొంటారని పేర్కొన్నారు.



రన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మహిళ కిడ్నాప్, లైంగిక దాడి కేసులో ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్

మియాపూర్: రోడ్డుపై నిలబడి ఉన్న మతిస్థిమితం లేని మహిళను బలవంతంగా స్కూటీపై ఎక్కించుకొని కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్‌రావు ఆ కేసు వివరాలను వెల్లడించారు. సంగారెడ్డి జిల్లా ఆమీన్‌పూర్ బద్దంకొమ్ములోని మారుతీ హిల్స్ కాలనీకి చెందిన బాలకుమార్ అలియాస్ శివకుమార్(25) కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతని స్నేహితుడైన మెదక్ జిల్లా దుర్గాగుడి పెద్దపూర్‌కు చెందిన గౌరగల్ల మహేష్(24)తో కలిసి 21వ తేదీన బ్లాకలర్ స్కూటీపై ఇద్దరూ మియాపూర్ బొల్లారం క్రాస్ రోడ్డు నుంచి బొల్లారం వైపు వెళుతున్నారు. తెల్లవారుజామున 2 గంటల సమయంలో మియాపూర్ క్రాస్ రోడ్డు బస్టాప్ వద్ద ఓ మహిళ(36) ఒంటరిగా కనిపించడంతో బలవంతంగా స్కూటీపై ఎక్కించుకొని వెళ్లారు. ఐలాపూర్ తండా సమీపంలో ఎవరూ లేని ప్రాంతం చూసి ఆ ఇద్దరు మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆపై ఆమెను వదిలేసి పరారయ్యారు. మహిళపై అత్యాచారం చేసినట్టు పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. ఓ కారు డ్రైవర్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు విచారణ భాగంగా మియాపూర్‌లో తనిఖీలు చేస్తుండగా బాలకుమార్, మహేష్‌లను అనుమానించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్టు అంగీకరించారు. నిందితుల్లో బాలకుమార్‌పై చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో స్నాచింగ్, రాబరీ, ఇళ్లల్లో దొంగతనాలు, భూతగాదాలు వంటివి 8 కేసులు ఉన్నాయి. మహేష్‌పై ఓ మర్డర్, దొంగతనం కేసులు అల్లాదుర్గం పీఎస్‌లో ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు.ఈ విలేకరుల సమావేశంలో సీఐ క్రాంతి కుమార్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైనేజీ, నీటి సరఫరా మెరుగుపరచాలని వినతి

రాయదుర్గం: టీఎన్‌జీఓ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాను మెరుగుపర్చాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా టీఎన్‌జీఓ కాలనీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ హౌసింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జి జంగయ్య, సభ్యులు సోమవారం జలమండలి అధికారులకు వినతిపత్రాన్ని సమర్పించారు. వేసవిలో ప్రతియేటా నీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పలుచోట్ల రోడ్లపైకి మురుగునీరు పారుతోందని, దుర్గంధం భరించలేకపోతున్నామని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలని కోరారు.

చిత్రలేఖన పోటీలు ప్రారంభం



మణికొండ: శివరాత్రిని పురస్కరించుకుని మహాశివుని చిత్రాలను వేసే పోటీలను సోమవారం మణికొండ మున్సిపాలిటీ, సెక్రటేరియట్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ప్రముఖ స్థపతి డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రారంభించారు. కాళీపట్నం ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షుడు రాం ప్రతాప్ మాట్లాడుతూ ఈ పోటీలో మొత్తం 25మంది ప్రముఖ చిత్రకారులు పాల్గొంటున్నారన్నారు. వారు గీసిన చిత్రాలతో శివరాత్రి రోజు ప్రదర్శన ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటేరియట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి. మనోహర్, నాయకులు శివరామకృష్ణ, కాంతారావు, వెంకటేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లగండ్లలో ఉప ముఖ్యమంత్రి పర్యటన

చందానగర్: శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల హుడా కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన అప్‌టౌన్ స్కిన్ అండ్ డెంటల్ క్లినిక్‌ను సోమవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైరా ఎమ్మెల్యే రామ్‌దాస్ నాయక్, ఎంబీసీ చైర్మన్ జెరిపేటి జైపాల్, కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ దుర్గా ప్రసాద్, కరుణాకర్ గౌడ్, రాంచందర్, జనార్ధన్‌రెడ్డి, విజయందర్‌రెడ్డి, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

27న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పిఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. ఈ నెల 27 తేదీ ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులో గల పీఎఫ్ కార్యాలయంలో, అపోలో ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్, కేపీహెచ్‌బీ ఫేజ్ 1, ధర్మారెడ్డి కాలనీలో అదాలత్ ఉంటుందని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవటమే కాక, సలహాలు, సూచనలు స్వీకరిస్తామన్నారు.

మల్లన్నస్వామి జాతర

పటాన్‌చెరు టౌన్: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముత్తంగి గ్రామంలో సోమవారం బీరప్ప, మల్లన్నస్వామి జాతర జరిగింది. కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్ జాతరలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.అనంతరం నీలం మధు మాట్లాడుతూ.... జాతర తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబిస్తుందన్నారు. కురుమ సంఘం అధ్యక్షులు కృష్ణ, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్ గౌడ్, నాయకులు అశోక్, సంజీవ్, దానయ్య, సందీప్ యాదవ్, ప్రవీణ్ గ్రామ పెద్దలు ,భక్తులు పాల్గొన్నారు.

నకిలీ పట్టాదారులపై కేసు నమోదు

- ఫిర్యాదు చేసిన శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్

గచ్చిబౌలి: తెలంగాణ ప్రభుత్వం గతంలో పేద, మధ్య తరగతి వారికి జీఓ నంబర్ 58,59 ద్వారా లబ్ధి చేకూరుస్తూ పట్టాలు అందజేసింది. అంజయ్యనగర్‌లో నకిలీ పట్టాల పేరిట ఇళ్లను నిర్మిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందడంతో రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం ఇన్‌స్పెక్టర్ వెంకన్న తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గచ్చిబౌలి సర్వే నంబర్లు 134,135, 136 పరిధిలోకి వచ్చే అంజయ్యనగర్‌లో జీఓ నంబర్ 58,59 ద్వారా జారీ చేసిన పట్టాలలో నకిలీవి ఉన్నాయంటూ శేరిలింగంపల్లి సర్కిల్ ఉపకమిషనర్ ముకుంద రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టాలు అందుకున్న 34 మంది లబ్ధిదారులకు నోటీసులు జారీ చేశారు. 27 మంది ఇప్పటి వరకు సమాధానం ఇవ్వగా అందులో నాలుగు పట్టాలు నకిలీవని తేలినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. మరో ఏడు మంది జవాబు ఇవ్వాల్సి ఉందని ఉపకమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో రాయదుర్గం పోలీసులు ఫోర్జరీ, చీటింగ్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

శంకర్‌నగర్ కాలనీ అభివృద్ధికి సహకారం

చందానగర్: చందానగర్ డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ కాలనీ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ఈ సందర్భంగా ఎస్‌డీఎఫ్ ఫండ్స్ మంజూరు పత్రాలను కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులకు సోమవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శంకర్‌నగర్ కాలనీ పార్కు అభివృద్ధికి రూ.10 లక్షలు, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం రూ.5 లక్షల నిధుల మంజూరు కొరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు పంపిన పత్రాలను వారికి అందజేయడం జరిగిందన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గాంధీని అసోసియేషన్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రఘునాథ్‌రెడ్డి, నూతన కార్యవర్గం అధ్యక్షులు ప్రవీణ్‌రెడ్డి, పీటీ చౌదరి, కృష్ణమూర్తి, ప్రవీణ్‌కుమార్, సురేష్ కుమార్, మల్లికార్జున్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గాంధీని కలిసిన కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు

విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి నేర్పాలి

చందానగర్: విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతి నేర్పాలని చందానగర్ డివిజన్ కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని స్కాలర్స్ నెస్ట్ గ్లోబల్ స్కూల్, తుషార్ ప్లే స్కూల్ వార్షికోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు సంస్కృతిని నేర్పించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసిన కార్పొరేటర్ మంజుల

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఎస్ రంగారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓయూ ప్రొఫెసర్స్ కాలనీ, మాధవి హిల్స్, గోల్డెన్ తులిప్ 1,2,3,4,5 రోడ్ నెంబర్ల పరిధిలో, వెంకటరమణ టాటా మోటార్స్‌లేన్, హైటెన్షన్ టవర్ లైన్ రోడ్ నుంచి విజేత సూపర్‌మార్కెట్ రోడ్డు వరకు, ప్రశాంత్‌నగర్, కొండాపూర్, జూబ్లీగార్డెన్, బిక్షపతినగర్, గోల్డెన్ తులిప్, రాఘవేంద్రకాలనీ ఏ,బీ,సీ బ్లాక్స్., రాజరాజేశ్వరి కాలనీ, హనుమాన్‌నగర్, సైబర్‌వ్యాలీ, గోపాల్‌రెడ్డినగర్, అపర్ణా, హఫీజ్‌పేట్ వంటి ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: గచ్చిబౌలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ భాస్కర్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు అంబికా సూపర్ మార్కెట్, పెద్దమ్మ దేవాలయం, బిఎన్ చౌరస్తా, వెంకటేశ్వర స్వామి దేవాలయం ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

- 11 కేవీ టీఎన్‌జీఓ కాలనీ ఫీడర్ పరిధిలో.. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు టీఎన్‌జీఓ కాలనీ, రంగారెడ్డి, ఢిల్లీ ఓల్డ్ స్కూల్, కేంబ్రిడ్జి స్కూల్ పరిసరాల్లో..

వైట్‌ఫీల్డ్ పరిధిలో...

- వైట్ ఫీల్డ్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీరామ్‌నగర్ ఏ,బీ,సీ బ్లాక్స్, వైట్ ఫీల్డ్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

చందానగర్‌లో..

చందానగర్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు.

- సాయిరాం నగర్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 వరకు కుమ్మరి బస్తీ, ఓల్డ్ హఫీజ్‌పేట్, జనప్రియ నగర్, జనప్రియ అపార్ట్‌మెంట్ డి బ్లాక్, ఎన్మా అపార్ట్‌మెంట్స్, డబుల్ బెడ్‌రూమ్‌లు, అపర్ణ హిల్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

నల్లగండ్ల సెక్షన్ పరిధిలో...

- కొమరంభీం ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు అంబికా సూపర్ మార్కెట్, పెద్దమ్మ టెంపుల్, బిఎస్ చౌరస్తా, వెంకటేశ్వర స్వామి టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్

- పరారీలో మరో ఇద్దరు నిందితులు
- కేసు వివరాలను వెల్లడించిన ఏసీపీ శ్రీనివాస్‌రావు

మియాపూర్: చేతబడి చేయడంతోనే తన తండ్రి కాళ్లు, చేతులు పడిపోయాయని, సోదరి పెళ్లి ఆగిపోవడం, తన అనారోగ్యానికి కారణం అనే అనుమానంతో ఓ వ్యక్తిపై కక్ష పెంచుకొని నలుగురు స్నేహితులతో కలిసి కర్రలతో కొట్టి హత్యచేసిన ముగ్గురు వ్యక్తులను చందానగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ఇరువురు పరారీలో ఉన్నారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మియాపూర్ ఏసీపీ శ్రీనివాస్ హత్యకేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. వివరాలు ఇలా..

చందానగర్ పాపిరెడ్డి కాలనీలో నివాసముంటున్న ఎండీ నజీర్(41) కారు డ్రైవర్. నెహ్రూనగర్‌కు చెందిన ఎండీ ఫక్రుద్దీన్(28) స్థానికంగా ఎలక్ట్రీషియన్. ఇద్దరూ చిన్ననాటి నుంచి స్నేహితులు. ఇటీవల నజీర్ చేతబడి చేస్తున్నట్టు ఇరుగుపొరుగు వారు చెప్పడంతో పక్రుద్దీన్‌కు నజీర్‌పై అనుమానం మొదలై, ఇద్దరి మధ్య గొడవలు ప్రారంభమయ్యాయి. ఫక్రుద్దీన్ తండ్రి మోహీద్‌బేగ్‌కు కాళ్లు, చేతులు పనిచేయకపోవడానికి నజీర్ చేతబడి కారణమని భావించాడు. నెల రోజుల క్రిందట ఫక్రుద్దీన్ సోదరి ఎంగేజ్‌మెంట్ జరిగింది. ఈ నిశ్చితార్థానికి వచ్చిన నజీర్ 15 రోజుల్లో చెల్లి పెళ్లి ఆగిపోతుందని చెప్పాడు. అదే జరిగింది. పైగా ఫక్రుద్దీన్ కూడా అనారోగ్యానికి గురికావడంతో నజీర్‌పై తీవ్ర అనుమానం ఏర్పడింది. దీంతో నజీర్‌తో పలు మార్లు గొడవలు పడ్డారు. ఎలాగైనా నజీర్‌ను చంపాలని కక్ష పెంచుకున్నాడు. ఈ క్రమంలో ఫక్రుద్దీన్ అదే కాలనీకి చెందిన స్నేహితుడు ఐటీ ఉద్యోగి మహ్మద్ అలీకి విషయం తెలిపాడు. దీంతో అలీ చందానగర్ బాబునగర్‌కు చెందిన రౌడీషీటర్ ఎండీ బురాన్‌ను కలిసి జరిగిన విషయాలను ముగ్గురు ప్రస్తావించారు. నజీర్‌కు, ఎండీ బురాన్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపార విషయంలో డబ్బులు ఇచ్చిపుచ్చుకోవడంలో గొడవలు జరుగుతున్నాయి. నజీర్‌పై కోపం ఉందని తనతో కూడా గొడవపడుతున్నాడని ఎండీ బురాన్ వారికి తెలిపారు. దీంతో ఫక్రుద్దీన్, అలీ, బురాన్‌లు కలిసి పథకం ప్రకారం ఈనెల 21వ తేదీన రాత్రి 8:30 గంటల సమయంలో నజీర్‌ను ఫక్రుద్దీన్ శేరిలింగంపల్లి గోపీనగర్ చెరువు కట్ట వద్దకు తీసుకువెళ్లాడు. ఆ తర్వాత వారి స్నేహితులు అలీ, బురాన్, మహ్మద్ ఖలీమ్ , అజర్‌లను పిలిచారు. వీరందరు కలిసి చెరువు కట్టపై మద్యం సేవించారు. తర్వాత ఫక్రుద్దీన్ కుటుంబంపై చేతబడి చేస్తున్నావని నజీర్‌పై గొడవకు దిగారు. ఆ సమయంలో ఫక్రుద్దీన్ పథకం ప్రకారం నజీర్ తలపై కర్రతో గట్టిగా కొట్టాడు. మిగతా స్నేహితులు కూడా నజీర్‌ను కర్రలతో తీవ్రంగా కొట్టారు. దెబ్బలు తాళలేక పక్కనే ఉన్న గోపీనగర్ బస్తీవైపు పరిగెత్తాడు. అతని అరుపులు విని కాలనీవాసులు ఆస్పత్రికి తీసుకెళ్లమని హెచ్చరించారు. దీంతో అలీ, బురాన్, ఖలీమ్ , అజర్‌లు అక్కడి నుండి వెళ్లిపోగా ఫక్రుద్దీన్ గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్న నజీర్‌ను వెనకాల ఎక్కించుకుని సమీపంలోని హైటెక్ బావర్చీ వద్దకు వచ్చి మళ్లీ స్నేహితులకు ఫోన్ చేశాడు. దీంతో అందరూ కారులో రాగా ఫక్రుద్దీన్ నజీర్‌ను కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తీసుకువెళ్లి అక్కడ చేర్పించి పారిపోయాడు. గాయాలతో ఉన్న నజీర్‌ను పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు చందానగర్‌కు చెందిన నజీర్‌గా గుర్తించారు. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా హత్యలో ప్రధాన నిందితుడైన ఫక్రుద్దీన్, రౌడీ షీటర్ బురాన్, ఖలీమ్‌లను అరెస్ట్ చేసి విచారించగా హత్య చేసినట్టు అంగీకరించారు. ఈ హత్యలో పాల్గొన్న హఫీజ్‌పేట్‌కు చెందిన అజర్, గోపీనగర్‌కు చెందిన మహ్మద్ అలీ పరారీలో ఉన్నట్లు తెలిపారు.